సాక్షి
వికారాబాద్

బుధవారం | 30 | జూలై | 2025



ఆదరణేదీ!

గత ప్రభుత్వం రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు 11 బస్సులతో కోస్గి ఆర్టీసీ డిపోను ప్రారంభించింది.

8లో▸



పట్టుకోండి చూద్దాం!

వాహన తనిఖీల్లో అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

8లో▸



కట్టెల పొయ్యిపైనే వంట

సర్కారు బడుల్లో కట్టెల పొయ్యిపైనే వంట తయారు చేయాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9లో▸

న్యూస్‌రీల్

కస్తూరుపల్లిలో కేంద్ర బృందం పర్యటన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్: మండలంలోని కస్తూరుపల్లిలో మంగళవారం కేంద్ర బృందం సభ్యులు జోసెఫ్, వినోద్ పర్యటించారు. గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. అభివృద్ధి పనులను గమనించారు. నర్సరీ, పశువుల షెడ్డు, ఫాంపండ్, ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధాప్య, వితంతవు, వికలాంగుల ఫించన్ల పంపిణీ గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డులను పరిశీలించారు. సీసీ రోడ్లు, ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడారు. దినసరి వేతనాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ రాములు తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలే లక్ష్యం

102, 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న శ్రీకాంత్

మోమిన్‌పేట: ప్రమాదంలో ఉన్న వారికి సత్వర సేవలు అందించడమే ముఖ్య కర్తవ్యమని 102,108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 102, 108 వాహనాలను జిల్లా సూపర్‌వైజర్ అబ్దుల్ రహీంతో కలిసి సందర్శించారు. వాహనాలోని మందులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాద స్థలం నుంచి ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. ప్రథమ చికిత్స చేయడంతోపాటు సమీపంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని ఆదేశించారు. అత్యవసరం అయితే తప్ప 102, 108కు కాల్ చేయరాదని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్‌కుమార్, జావిద్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పరిగి విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో ఆర్యన్

పరిగి: తైక్వాండో రాష్ట్ర స్థాయి జూనియర్స్ విభాగంలో పరిగి విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడు. నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పరిగి విద్యార్థి ఆర్యన్ సత్తాచాటాడు. చిన్న వయస్సులో బంగారు పతకం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



పూడూరు: ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ)కమిటీ పరిగి నియోజకవర్గ చైర్మన్‌గా మండలంలోని మంచన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కక్కులూరి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఉదయం 11 గంటలకు పరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రమాణ శ్రీకార కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. రైతు సంక్షేమానికి ఆత్మ కమిటీలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రమాణ శ్రీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నాగుల పంచమి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆయా గ్రామాల్లోని పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళల సందడి కనిపించింది.

– తాండూరు రూరల్



తాండూరులో పుట్టకు పూజ చేస్తున్న మహిళలు

అభివృద్ధి, సంక్షేమం

- బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు
- సీఎం రేవంత్‌రెడ్డి సమర్థతతో ప్రగతి వైపు అడుగులు
- డిప్యూటీ సీఎం భట్టి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్
- తాండూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

అప్పులు కడుతూనే సమర్థవంతంగా అమలు



లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

తాండూరు: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులు కడుతూనే సమర్థవంతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో రూ.7.32 కోట్ల విలువ చేసే సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఖాంజాపూర్ వద్ద స్వాగత ముఖద్వార పనులను ప్రారంభించారు. ఆ తర్వాత జీపీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని 22,292 మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మంత్రి మాట్లాడారు. తాండూరు అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రోడ్లు, విద్యుత్ సబ్ స్టేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు కావాలంటూ ప్రతిపాదనలతో తమ వద్దకు వస్తున్నట్లు తెలిపారు. ఆయన చొరవతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా అధిక నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పథకాలు అందుతున్న నవ్వులు ప్రజల్లో కనిపిస్తాయని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 70 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. వారిని అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెబుతారని హితవు పలికారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తాండూరు అంటే సీఎం జిల్లా అన్నారు. ఇక్కడ మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ లాంటి పెద్ద నేతలు ఉన్నారని పేర్కొన్నారు. షాబాద్ స్టోన్ అంటే యావత్ ప్రపంచానికి తెలుసన్నారు. తాండూరు నాపరాతి పరిశ్రమల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రితో మాట్లాడతానని పేర్కొన్నారు. తాండూరు బైపాస్ పనులకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు అందాయన్నారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సమర్థులు కాబట్టే గత ప్రభుత్వం చేసిన అప్పులు కడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నారని కొనియాడారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. సీఎం జిల్లా కావడంతో పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.90 కోట్లు మంజూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంతకుముందు మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేష్ మహరాజ్, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి ఇంట్లో భోజనం

తాండూరు రూరల్: తాండూరు పర్యటనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు తన స్నేహి తుడి ఇంటికి వెళ్లారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు మంచి స్నేహితులు. ఆయన ఆహ్వానం మేరకు మంత్రి శ్రీధర్‌బాబు తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మరి కొందరు శ్రీకాంత్ రెడ్డి ఇంటికి వెళ్లి భోజనం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాలాల: మండలంలోని దౌలాపూర్ శివారులో రూ.230 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.30 కోట్లతో హాజీపూర్, తాండూరు, బెల్కటూరు, నారాయణపూర్, పాషపూర్ గ్రామాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టారు. అంతకుముందు జుంటుపల్లి రామస్వామి ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. డిప్యూటీ సీఎం కళాశాల స్నేహితుడు శ్యాంసుందర్‌రావు ఇంట్లో ఏర్పాటు చేసిన తేనేటీ విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, హన్మంతు, అక్బర్‌బాబా, భీమప్ప, ఖాసీం, నాగప్ప, హాజీపూర్ మాజీ సర్పంచ్ బాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు కోర్టులో ఊరట

దుద్యాల్: మండలంలోని లగచర్ల గ్రామ రైతులకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. గత ఏడాది నవంబర్ 11న ఫార్మాసిటీ ఏర్పాటులో భాగంగా భూ సేకరణకు వచ్చిన అధికారులపై రైతులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 72 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. వీరిలో 36 మంది తోపాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. మరో 36 మంది ముందస్తు బెయిల్ తీసుకున్నారు. రైతులు ప్రతి నెలా కోర్టుకు వెళ్లాల్సి వచ్చేది. ఎప్పటిలాగే మంగళవారం కూడా నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. రైతుల తరఫున లాయర్ లక్ష్మణ్ వాదనలు వినిపించారు. పొలం పనులు చేసుకునే వీరు కోర్టుకు రావడం వల్ల ఇబ్బంది పడుతున్నారని జడ్జికి విన్నవించారు. వాదనలు విన్న జడ్జి రైతులకు ఊరట నిచ్చారు. చార్జిషీటు వేసిన తర్వాత సమన్లు జారీ చేస్తామని, అప్పుడు కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు లాయర్ తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ని కలిసిన మాజీ ఎమ్మెల్యే

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ వి.రామసుబ్రమణియన్‌ను లగచర్ల ఘటనలో ఏ–1గా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఏ –2 సురేశ్‌రాజ్, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోట్ల మైపాల్ తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. లగచర్ల ఘటన జరిగిన రాత్రి పోలీసులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారిని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



నాంపల్లి కోర్టు వద్ద లగచర్ల రైతులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: వికారాబాద్ మండలం అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ సీట్ల కోసం గురువారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, 3 సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు అర్హుల జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు.

బూర్గుపల్లి గురుకులంలో..

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల(బాలికలు, మోమిన్‌పేట)లో ఈ ఏడాది ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో ఉత్తీర్ణులైన విద్యార్థులు కేటగిరీ, మార్కుల ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రెండు గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 8978815827, 9908568956లో సంప్రదించాలన్నారు.

పరిగిలో..

పరిగి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 24, బైపీసీ 23 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9704550225లో సంప్రదించాలన్నారు.

పచ్చిమిర్చి కిలో రూ.100

కొడంగల్: మార్కెట్‌లో పచ్చి మిర్చి ధర కిలో రూ.వంద దాటింది. నిత్యావసరమైన మిరపకాయల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేకపోతున్నారు. మిర్చితో పాటు పెరిగిన కూరగాయల ధరలు సాధారణ కుటుంబాల్లో దడ పుట్టిస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గి, ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పెరిగిన ధరలతో కూరలు వండలేకపోతున్నామని మహిళలు పేర్కొంటున్నారు. కొడంగల్‌లో మంగళవారం పచ్చి మిరపకాయలు కిలో రూ.100, కాప్సికం రూ.80, బీర రూ.80, చిక్కుడు రూ.80, గోరు చిక్కుడు రూ.80, టమాటా రూ.50, బెండ రూ.50, ఆలుగడ్డ కిలో రూ.50 ఉందని



మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకుకూరల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. దళారులు, వ్యాపారులు సిండికేటుగా మారి ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నానే విమర్శలు ఉన్నాయి.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

- ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు లబ్ధి
- అంతర పంటల సాగుకు రాయితీలు
- అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- వ్యవసాయశాఖ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



వికారాబాద్: ఆయిల్‌పాం మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల, స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ఆయిల్ పాం సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయశాఖ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం కొత్రెపల్లిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆయిల్‌పాం మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందన్నారు. వికారాబాద్ ప్రాంత భూములు ఈ తరహా సాగుకు ఎంతో అనుకూలమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో సాగు చేస్తే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ పంట ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు దిగుబడి వస్తూనే ఉంటుందన్నారు. ఎకరాకు ఏడాదికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. నాలుగేళ్లపాటు అంతర పంటల సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని వివరించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

రేవంత్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ వ్యవసాయ రంగానికి కేటాయించిందన్నారు. రూ.21 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. రైతు భరోసా, సన్నరకం వడ్లకు బోనస్ తదితర ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఆయిల్‌పాం సాగుకు మన జిల్లా భూములు ఎంతో అనుకూలమన్నారు. గత ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల, ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ డైరక్టర్ హాస్మిన్‌బాషా, డిప్యూటీ డైరక్టర్ నీరజగాంధీ, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, ఆర్డీఓ వాసుచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ



దివ్యాంగులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, చేయూత పింఛన్లు వెంటనే పెంచాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌మాదిగ కోరారు. మంగళవారం మెట్లకుంటలో దివ్యాంగులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ మొత్తం పెంచుతామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లో ఆగస్టు 13న మహాగర్జన ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 2వ తేదీ కొడంగల్‌లో సన్నాహక సదస్సు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నరసింగరావు, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ ప్రకాశ్ మాదిగ, వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకటయ్య, మల్లేశ్, యాదయ్య, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పర్తాని మృతి

బషీరాబాద్‌కు నాలుగు సార్లు ఏకగ్రీవం


శ్రీనివాస్ పర్తాని(ఫైల్)

బషీరాబాద్: ప్రముఖ వ్యాపారవేత్త, బషీరాబాద్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పర్తాని(93) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. 1971–1989 బషీరాబాద్ సర్పంచ్‌గా నాలుగు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సృష్టించారు. అనంతరం కుటుంబం తాండూరుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. మంగళవారం తాండూరులో ఆయన అంత్యక్రియలు జరిపించారు. పర్తాని మృతిపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు వారి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ బషీరాబాద్ సీనియర్ నాయకులు వెంకటేశ్ మహరాజ్, అజయ్‌ప్రసాద్, మాణిక్‌రెడ్డి, పవన్‌ఠాకూర్, జగన్నాథ్, పలువురు వ్యాపారవేత్తలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ప్రభాకర్ (ఫైల్)

కుల్కచర్ల: కుటుంబ ఉన్నతికి గృహ నిర్మాణ రంగంలో పనిచేసేందుకు వెళ్లిన వ్యక్తి విగతజీవిగా మారాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన బోయిన ప్రభాకర్(35) గృహనిర్మాణ రంగంలో పనిచేస్తున్నాడు. ప్రభాకర్ మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఓ భవన నిర్మాణంలో పనిచేస్తుండగా విద్యుత్‌వైర్లు తగడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంతోష, కూతురు సహస్ర(7), కుమారుడు రిత్విక్(5) ఉన్నారు.

తప్పిపోయిన బాలుడు కుటుంబీకుల చెంతకు


బాలుడిని కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

పూడూరు: తప్పిపోయిన బాలుడిని చన్గోముల్ పోలీసులకు తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బాలుడు ప్రవీణ్(7) మంగళవారం చేవెళ్ల బస్ స్టేషన్‌లో తాండూరు డిపో బస్సు ఎక్కాడు. కండక్టర్ టికెట్ అడగడంతో బాలుడు డబ్బు లేదని చెప్పాడు. తండ్రి పేరు అడగ్గా ఎల్లప్పగా చెప్పాడు. దీంతో కండక్టర్ చన్గోముల్ ఠాణాలో అప్పగించాడు. పోలీసులు విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టడంతో మొయినాబాద్‌కు చెందిన ఎల్లప్ప దంపతులు పోలీసులను సంప్రదించారు. దీంతో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మళ్లీ ట్రెక్ పార్కులోకే వచ్చిన చిరుత

మణికొండ: మంచిరేవుల ట్రెక్ పార్కు నుంచి రాందేవ్‌గూడ మిలిటరీ ప్రాంతంలోకి వెళ్లిన చిరుత పులి ఒక రోజులోనే తిరిగి ట్రెక్ పార్కుకే చేరుకుంది. సోమవారం తెల్లవారుజామున రాందేవ్‌గూడలోని మిలిటరీ ప్రాంతంలో రహదారి దాటుతూ అక్కడి సీసీ కెమెరాలో కనిపించిన విషయం తెలిసిందే. అక్కడ దానికి అనువుగా ఉండకపోవటంతో అది తిరిగి సోమవారం అర్ధరాత్రి 12.25 గంటలకు ట్రెక్ పార్కుకు చేరుకుని ట్రాప్ కెమెరాలో చిక్కిందని అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ప్రశాంతమైన అటవీ ప్రాంతాన్నే చిరుత ఇష్టపడుతుందన్నారు. మిలిటరీ ప్రాంతంలో దానికి ఆహారం లభించకపోవటం, వాహనాల శబ్దాలు అధికంగా రావటంతోనే తిరిగి ట్రెక్ పార్కుకు వచ్చి ఉంటుందని చెప్పారు. ట్రెక్ పార్కులో దానికి ఇష్టమైన అడవిపందుల వంటి ఆహారం లభిస్తుండటం, ఎలాంటి అవాంతరాలు లేకపోవటంతో మరికొన్ని రోజులు ఇక్కడే ఉండే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దానికి సరైన ఆహారం లభించనప్పుడే బోన్‌లో ఎరగా పెట్టిన మేకను తినేందుకు వచ్చి చిక్కే అవకాశం ఉంటుందన్నారు. అప్పటి వరకు ట్రెక్ పార్కును మూసి ఉంచుతామని, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డులో ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలని లక్ష్మణ్ సూచించారు.

ఆదరణేది!

కోస్గి డిపోపై పాలకుల నిర్లక్ష్యం

- బస్సు సర్వీసులు లేక ప్రజల ఇబ్బందులు
- పాఠశాల సమయానికి చేరుకోలేకపోతున్న విద్యార్థులు


కోస్గి బస్ డిపో

కొడంగల్: గత ప్రభుత్వం రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు 11 బస్సులతో కోస్గి ఆర్టీసీ డిపోను ప్రారంభించింది. నాడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ డిపోను ప్రారంభించారు. ఏళ్లు దాటినా బస్సు సర్వీసులు పెంచకుండా అరకొర బస్సులతోనే నిర్వహణ కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. హైదరాబాద్, మహబూబ్‌నగర్, తాండూరు ప్రధాన రూట్లలో సరిపడా సర్వీసులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్న బస్సులు సైతం ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి.

మూడేళ్ల క్రితం మరోసారి ప్రారంభం

గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం రాష్ట్ర మంత్రి కేటీఆర్ మరోసారి డిపో ప్రారంభోత్సవం చేశారు. ఇప్పటికైనా గ్రామాలకు బస్సులు వస్తాయని ఆశించిన నియోజకవర్గ ప్రజలు ఆశించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రేవంత్‌రెడ్డి కోస్గి డిపోకు కొత్తగా బస్సులు కేటాయించి హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. పల్లెలకు బస్సుల సౌకర్యం లేక ఆటోలు, జీపులను ఆశ్రయిస్తున్నారు.

సౌకర్యాల లేమి

- డిపో ఏర్పాటు చేసినా డిపో మేనేజర్ నియామకం చేపట్టలేదు
- డిపోలో కనీస సౌకర్యాలు కల్పించలేదు.
- బస్సులను శుభ్రం చేసేందుకు స్టాండ్ ఏర్పాటు చేయలేదు.
- డిపోలే డీజిల్ ఫిల్లింగ్ సౌకర్యం ఏర్పాటుకు నోచుకోలేదు.
- పూర్తిస్థాయి మెకానిక్‌లు నియమించలేదు.
- సిబ్బంది నియామకం నామమాత్రమే

పాఠశాలలకు ఆలస్యం

ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజక వర్గంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాండూరు, మహబూబ్‌నగర్ లాంటి పట్టణాలకు ఒకేసారి ఒకే సమయంలో ఐదారు సర్వీసులు నడుపుతున్నారు. ఆ బస్సులు వెళ్లాయంటే మళ్లీ గంట వరకు బస్సులు రావడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రార్థనకు ఆలస్యంగా వెళ్లడంతో టిఫిన్స్ అందడం లేదు. పాఠశాల సమయానికి విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు వేయాలని డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ఎంఈఓ రాంరెడ్డి ఆరోపించారు. రుద్రారం, నీటూరు, అప్పాయిపల్లి, చిట్లపల్లి, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి, టేకుల్‌కోడ్, అన్నారం, నాగారం, ధర్మాపూర్, పాటిమీదిపల్లి గ్రామాల విద్యార్థులకు ప్రతి రోజూ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

విస్తరణకు నోచుకోని కొడంగల్ బస్టాండ్

1979 అక్టోబర్ 24 అప్పటి రవాణా శాఖ మంత్రి వెంగళ్‌రావు శంకుస్థాపన చేసిన కొడంగల్ బస్టాండ్‌ను 1981 డిసెంబర్ 19న అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య, రవాణా శాఖ మంత్రి రోశయ్య ప్రారంభించారు. నాటి నుంచి ఈ బస్టాండ్ విస్తరణకు నోచుకోలేదు. కొడంగల్ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. వికారాబాద్‌కు వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సిందే. వికారాబాద్ వెళ్లాలంటే పరిగి మీదుగా నుంచి 52 కిలోమీటర్లు, తాండూరు మీదుగా 63 కిలోమీటర్ల ప్రయాణించాల్సిందే.

సమాచారం లేకుండా శిలా ఫలకాలా!


బాధితులతో కలిసి మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

యాలాల: మండలంలోని దౌలాపూర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు పేదల భూములను బలవంతంగా లాక్కోవడం అన్యాయమని కేవీపీఎస్, దళిత సంఘం నాయకులు అన్నారు. మంగళవారం వారు బాధిత రైతులతో కలిసి మాట్లాడుతూ.. చెన్నారం గ్రామానికి చెందిన అశోక్, కొనిగేరి చంద్రప్ప, కొనిగేరి మాదరప్ప తదితరులకు ప్రభుత్వం సర్వే నెంబర్లు 73, 73/5/3 నెంబర్లలో రెండెకరాల భూమిని కేటాయించింది. 50 ఏళ్లుగా బాధిత కుటుంబాలు భూమిపై ఆధారపడి జీవిస్తున్నారు. కాగా తమకు కేటాయించిన భూమిలో ఎటువంటి సమాచారం లేకుండా శిలాఫలకాలు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. 2013భూ సేకరణ చట్టం ప్రకారం.. బాధిత రైతుకు భూమికి భూమి, పరిహారం ఇవ్వాలని ఉండగా, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, రైతులు వెంకటమ్మ, రాములమ్మ, చంద్రప్ప, మాదరప్ప, సిద్ధు తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ధారూరు: మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఎరువుల నిల్వలను మంగళవారం వికారాబాద్ వ్యవసాయ సంచాలకుడు వెంకటేశం తనిఖీ చేశారు. ధారూరు, హరిదాస్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో, మోమిన్‌ఖుర్దులోని ఆగ్రో సెంటర్‌లో ఎరువుల నిల్వలు, విక్రయానికి సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అవసరం మేరకు యూరియా కోసం వెనువెంటనే ఇండెంట్లు పెట్టుకోవాలని.. యూరియా కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని దుకాణదారులకు సూచించారు. అనంతరం మున్నూరు సోమారం గ్రామ సమీపంలో సాగుచేసిన పత్తి పొలానికి ఎరువు వేసే ప్రక్రియను పరిశీలించారు. పత్తికి పైపాటుగా యూరియా వేయడం వలన గాలిలో కలిసిపోయి మొక్కకు ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చదని చెప్పారు. పత్తి మొక్కలకు ఆరు ఇంచుల దూరంలో మట్టితీసి యూరియా వేశాక కప్పివేయాలనీ ఆయన రైతులకు సూచించారు. ఏడీఏ వెంట ఏఈఓ సంజూరాథోడ్ ఉన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించండి

పరిగి డీఎస్పీ శ్రీనివాస్


బొంరాస్‌పేట ఠాణాలో గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

బొంరాస్‌పేట: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు రక్షణ కల్పించాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. వార్షిక సందర్శనలో భాగంగా మంగళవారం ఆయన బొంరాస్‌పేట్ ఠాణాను సందర్శించారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియా నాజ్


విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారి రుబియా నాజ్

యాలాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి అని యాలాల పీహెచ్‌సీ వైద్యాధికారి రుబియా నాజ్ అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ గోపాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు వేడి భోజనంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని.. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకుని మందులు తీసుకోవాలన్నారు. అనంతరం వసతి గృహంలోని వంట సరుకులు, బియ్యం, కూరగాయలను పరిశీలించి వసతి గృహ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్, పీహెచ్‌ఎన్ సుశీల, సూపర్‌వైజర్ శోభారాణి, పల్లె దవాఖాన డాక్టర్ స్రవంతి, ఏఎన్‌ఎం లక్ష్మీ తదితరులు ఉన్నారు.

పేరుకే పైలెట్ ప్రాజెక్ట్


కొందుర్గు రెవెన్యూ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి(ఫైల్)

కొందుర్గు: ధరణి లోపాలను సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టంతోనైనా తమ సమస్యలు తీరుతాయని ఆశించిన రైతుల కలలు కల్లలయ్యాయి. ఈ ఏడాది జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వస్తుందని చెప్పిన పాలకుల ప్రసంగాలు విని సంతోషించారు. ప్రభుత్వం జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్‌గ్రామంగా ఎంపిక చేసింది. దీంతో మే 30న నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ప్రసంగిస్తూ మండలంలో భూ సమస్యలన్నింటికి పరిష్కారం చూపి రోల్‌మోడల్‌గా నిలపాలని అధికారులకు సూచించడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సదస్సులు పూర్తయి రెండు నెలలు గడిచినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు విన్నవించినా కదలని ఫైల్

భూభారతి అవగాహన సదస్సులో భాగంగా మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ నారాయణ రెడ్డికి పలువురు రైతులు తమ సమస్యలు వివరించారు.

- కొందుర్గు తూర్పు, పడమర రెండు రెవెన్యూ గ్రామాలుగా ఉండడంతో తమ భూములు నిషేధిత జాబితాల్లో చేరాయని గ్రామానికి చెందిన పెరుమాళ్ల శేఖర్ ఫిర్యాదు చేశారు.
- చెర్కుపల్లిలో 48 మంది భూములు అకారణంగా నిషేధిత జాబితాలో పడ్డాయని పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి వాపోయారు.
- 1954 ఖాస్రా పహణీ రికార్డుల ప్రకారం చెర్కుపల్లికి చెందిన సర్వే నంబర్లు 119, 260, 271, 272, 274, 277, 280, 281, 282, 295లలో 79 ఎకరాల విస్తీర్ణం ఉన్న భూమి వేంకటేశ్వర స్వామి ఆలయం పేరిట పట్టా చేశారు.
- 1958లో భూములను రీ సర్వేచేయడంతో శివారులోని 1, 2, 4, 12, 67, 100, 107, 108, 146, 147, 148, 158, 159, 172, 318, 348, 252, 354, 357, 358, 359 లలో విస్తీర్ణం 79 ఎకరాల భూమిని వెంకటేశ్వరస్వామి పేరున పట్టా మార్చారు.

ఆగం చేసిన ధరణి పోర్టల్

ధరణి పోర్టల్ ఏర్పాటు సయమంలో రీసర్వేకు ముందు, తర్వాత మొత్తంగా 158 ఎకరాలను ఆలయ భూమిగా చూపుతూ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో 48 మంది రైతులకు చెందిన భూములు నిషేధిత జాబితాలో చేరాయి. ఈ విషయమై బాధిత రైతులు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం అవ్వలేదు. ఇందుకు స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు పూర్తైన వెంటనే సమస్యలన్నింటికి పరిష్కారం చూపుతాం. కొందుర్గును రాష్ట్రానికే దిక్సూచిగా మార్చుతాం అంటే సంతోషపడ్డారు. కానీ నేటికి సమస్యలు తీరలేదు.

పేరుకుపోయిన సమస్యలు

- భూ భారతిలోనూ ధరణి తప్పిదాలు
- ఇదేనా రోల్‌మోడల్ అంటూ రైతుల అసహనం

రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు


మొత్తం దరఖాస్తులు	573
ఆమోదం పొందిన దరఖాస్తులు	38
ఆర్డీఓ కార్యాలయంలో పెండింగ్	56
అడిషనల్ కలెక్టర్ వద్ద పెండింగ్	70
రిజెక్ట్ అయిన దరఖాస్తులు	120

సమస్య తీరేలా లేదు



తాతల కాలం నుంచి పట్టా భూములు సాగుచేసుకుని బతుకుతున్నాం. తమకు ఆపద వచ్చి ఓ గుంట భూమిని అమ్ముకుందామని వెళితే మీ భూములు దేవుడి పేరున ఉన్నాయి. అమ్మడానికి వీలుకాదని అధికారులు చెబుతున్నారు. భూ భారతి చట్టంతోనైనా మా సమస్య తీరుతుంది అనుకున్నాం. కాని ఏమి లాభం లేదు. మేము సచ్చినా సమస్య తీరేలా లేదు.
– వడ్డె చంద్రయ్య, రైతు, గంగన్నగూడ

త్వరలో పరిష్కారం



వీలైనంత త్వరలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. ఇప్పటికే దాదాపు సమస్యలకు పరిష్కారం చూపాం. వివిధ స్థాయిల్లో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే పరిష్కారం కావచ్చు.
– రమేశ్ కుమార్, తహసీల్దార్, కొందుర్గు

పట్టుకోండి చూద్దాం!

- పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర దొంగలు పరార్
- పోలీసులను తోసేసి పొలాల్లోకి పరుగులు
- బైక్, నాటు తుపాకీ, కత్తులు, స్క్రూ డ్రైవర్ స్వాధీనం


తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

పరిగి: వాహన తనిఖీల్లో పట్టుబడిన అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం రాత్రి పట్టణ కేంద్రంలో సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్, వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిన ఓ బైక్‌పై కొడంగల్ నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానంగా కనిపించడంతో పోలీసులు వారిని నిలువరించి తనిఖీ చేశారు. వారిని వద్ద ఉన్న సంచిలో ఏముందని అడగడంతో కంగారు పడ్డారు. వారి వద్ద నుంచి సంచిని లాక్కొని పరిశీలించగా నాటు తుపాకీ, కత్తులు, స్క్రూ డ్రైవర్ లభ్యమయ్యాయి. ఈ క్రమంలో ముగ్గురు దుండగులు పోలీసులను తోసేసి సుల్తాన్‌పూర్ వైపు పొలాల్లోకి పరుగులు తీశారు. పోలీసులు వెంబడించినా వారి దొరక్కుండా పరారయ్యారు. అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. కర్ణాటక పాసింగ్ బైక్, నాటు తుపాకీ, కత్తులు, స్క్రూ డ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాసంఘాల ఆగ్రహం

చేతికి చిక్కిన దుండగులు పోలీసుల కళ్ల ఎదుటే పరారవుతుంటే పట్టుకోవడంలో విఫలమయ్యారని ప్రజా సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. పరిగి పరిసర ప్రాంతాల్లో నిత్యం చోరీల ఘటనలకు కారణం అంతరాష్ట్ర ముఠాలే అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దుండగులను పట్టుకోవాల్సిన పోలీసులు బురద, పొదలుండడంతో వెనుకడుగు వేశారని స్థానికులు వాపోతున్నారు. పరుగెత్తుతున్న వారిని పట్టుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చోరీలకా.. హత్యకా..?

సంచిలో కత్తులు, నాటు తుపాకీ, స్క్రూ డ్రైవర్‌లను తీసుకెళ్తున్న దుండగులు చోరీల కోసమా.. లేదంటే ఎవరినైనా హత్య చేసేందుకా అనే అనుమానాలు వస్తున్నాయి. ఇటీవల చోరీలు, హత్యలు జరుగుతుండడంతో ఈ ఘటన వల్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైక్ నంబర్, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

గాలింపు కొనసాగిస్తున్నాం



దుండగుల కోసం గాలింపు చర్యలు కొసాగిస్తున్నాం. వారి నుంచి నాటు తుపాకీ, కత్తులు, స్క్రూ డ్రైవర్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నాం. బైక్ నంబర్, టెక్నికల్ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ముందుకు వెళ్తున్నాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.
– మోహన్ కృష్ణ, ఎస్ఐ, పరిగి

భట్టి పర్యటనలో ప్రొటోకాల్ రగడ

- ఫ్లెక్సీలో మండలి చీఫ్ విప్ ఫొటో లేకపోవడంపై ఆగ్రహం
- అధికారులను నిలదీసిన పట్నం వర్గీయులు


వివాదానికి కారణమైన దౌలాపూర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

యాలాల: మండల పరిధిలోని దౌలాపూర్ సమీపంలో మంగళవారం చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసింది. హాజీపూర్‌తో పాటు మరో ఐదు ప్రాంతాల్లో కొత్తగా ఆరు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ విషయమై కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డిప్యూటీ సీఎంతో పాటు స్పీకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ఫొటో లేకపోవడాన్ని గమనించిన ఆయన వర్గీయుడు రఘు, సంబంధిత శాఖ అధికారులను నిలదీశారు. పట్నం ఫొటో వేయకూడదని ఎవరైనా చెప్పారా? ప్రొటోకాల్ తెలీదా అంటూ ట్రాన్స్‌కో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారుల తీరు సరిగా లేదని పట్నం వర్గీయులు అభిప్రాయపడుతున్నారు.

డిప్యూటీ సీఎంకు నిరసన సెగ

కాగా దౌలాపూర్‌లో శంకుస్థాపన కార్యక్రమాన్ని ముగించుకుని తాండూరు వెళుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీజేపీ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. రెండు రోజుల క్రితం కాగ్నా కొత్త బ్రిడ్జిపై రంధ్రం పడటంతో పాటు అధ్వాన్నంగా తయారైన రోడ్ల విషయమై బీజేపీ నాయకులు ఆయన కాన్వాయ్‌కు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు.

పాదయాత్రకు తరలిరండి

- రేపు రంగాపూర్ నుంచి ప్రారంభం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ భావజాల్లాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31న రంగాపూర్ నుంచి పరిగి పట్టణ కేంద్రం వరకు సాయంత్రం 5 గంటలకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఉంటుందన్నారు. శుక్రవారం తుంకుల్‌గడ్డలో శ్రమదాన కార్యక్రమం, ఉమ్మడి జిల్లా పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ మేర మేలు చేకూరుస్తున్నాయని తెలుసుకువడమే పాదయాత్ర ఉద్దేశమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు దిశానిర్దేశంపై చర్చిస్తామన్నారు. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42శాతం రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తే కేంద్రం అడ్డుపడుతోందన్నారు. కేంద్రంపై కొట్లాడేందుకు ఆగస్టు 5,6,7వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్‌ల కోసం కొట్లాడుతామన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భర్త నుంచి విడదీసి మోసం చేశాడు

- ప్రియుడిపై ఓ యువతి ఆరోపణ
- న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

తాండూరు రూరల్: తనను వివాహం చేసుకుంటానని భర్త నుంచి దూరం చేసిన ప్రియుడు ఆ తర్వాత మోసం చేశాడని ఓ యువతి ఆరోపించింది. ఈ విషయమై మంగళవారం తల్లిదండ్రులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, తనకు న్యాయం చేయాలని కోరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి ఇదే ఊరికి చెందిన మరో యువకుడు ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ ఇష్టంలేని యువతి తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం ఆమెను కర్ణాటకకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత సదరు యువతి భర్తకు ఫోన్ చేసిన ప్రియుడు తమ ప్రేమ వ్యవహారాన్ని చెప్పాడు. దీంతో యువతిని ఆమె భర్త వదిలేశాడు. అనంతరం తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన సదరు వ్యక్తి, కాలయాపన చేస్తూ మోసం చేశాడని యువతి ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఇదిలా ఉండగా యువతి పీఎస్‌కు వచ్చిన మాట వాస్తవమేనని పోలీసులు తెలిపారు. బుధవారం వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని వెళ్లిపోయారని చెప్పారు.

ఐదో అంతస్తునుంచి జారిపడి..

- వ్యక్తి దుర్మరణం
- మెటీరియల్ యంత్రాన్ని గమనిస్తుండగా ప్రమాదం

శంకర్‌పల్లి: మనం ఒకటి తలిస్తే.. విధి మరొకటి తలచిందంటారు. అచ్చం అలాంటి సంఘటనే మంగళవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. తన ఒక్కగానొక్క అల్లుడిని మంచి స్థాయిలో చూద్దామని కలలుగన్న మామకు దుఃఖమే మిగిలింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిరుమలపూర్‌కి చెందిన రాజు భవన నిర్మాణ కాంట్రాక్టర్. ఆయనకి ఒక్కగానొక్క కుమార్తె సంగీత ఉంది. ఆమెని 2021లో చౌడపూర్ మండలం లింగంపల్లి తండాకి చెందిన నేనావత్ సంతోష్(33)కి ఇచ్చి వివాహం చేయగా.. వారికి రెండేళ్ల పాప ఉంది. మొదటి నుంచి సంతోష్ ఫార్మసీ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తక్కువ జీతానికి పని చేస్తున్నాడని, తనని మంచి స్థాయిలో నిలపెడుదామని సంతోష్ మామ నిర్ణయించుకున్నాడు. తన కన్‌స్ట్రక్షన్ విభాగంలోకి రెండు నెలల క్రితమే తీసుకొచ్చి సూపర్‌వైజర్‌గా చేశాడు. మంగళవారం సంతోష్ భవనం 5వ అంతస్తులో విధులు నిర్వహిస్తున్నాడు. అక్కడి నుంచి మెటీరియల్ తీసుకొచ్చే యంత్రాన్ని గమనిస్తూ కిందికి చూశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే పక్కనే ఉన్న ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అల్లుడిని ఉన్నత స్థాయిలో చూద్దామ ని ఆశపడిన మామకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు తదితర అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.